## క్లుప్తంగా

### హైమాస్ట్ లైట్ల ప్రారంభం



**అయిజ:** పట్టణంలోని నీలకంఠేశ్వరస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను పీఏసీఎస్ కార్యదర్శి సంపత్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ ద్వారా మంజూరైన నిధులతో పట్టణంలోని వివిధ కాలనీల్లో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సీహెచ్ సైదులు, తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు దీప్ ప్రజ్ఞ, అలంపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దొడ్డెప్ప, వైస్ చైర్మన్ కుమార్, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

### వీల్‌చైర్, ఆర్థికసాయం అందజేత



**మానవపాడు:** మండల కేంద్రానికి చెందిన రంజాన్‌కు స్థానిక యువకులు సోమవారం వీల్ చైర్, ఆర్థిక సాయం అందించి గొప్ప మనసు చాటుకున్నారు. 12 ఏళ్ల క్రితం కాళ్లపై పైపులు పడి కాళ్లపోయిన ఇంటికే పరిమితమైన రంజాన్‌కు కానిస్టేబుల్ రవి వీల్‌చైర్, డిప్యూటీ తహసీల్దార్ ధరణిషా రూ. 2వేలు, తరుణ్ రూ.2వేలు, రవి, శ్రీను, సురేష్, శివ కలిసి రూ. 4వేలు మొత్తం రూ. 8వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా రంజాన్ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

### సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



**ఇటిక్యాల:** మండల పరిధిలోని నక్కలపల్లిలో గ్రామానికి చెందిన లబ్ధిదారులకు సోమవారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. టి.సుంకన్నకు రూ.27,500, వెంకటరాముడుకు రూ.17,000 విలువ గల చెక్కులను మండల యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ రాజ్‌కుమార్ అందజేశారు. కార్యక్రమంలో నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, నల్లన్న, చిన్నమద్దిలేటి, శ్రీరాముడు, సీతారాముడు, టైలర్ రాముడు, రంగస్వామి, రవి, రాముడు తదితరులు పాల్గొన్నారు.

### ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**ఎర్రవల్లి:** గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ ఏఈ శేఖర్ సోమవారం సూచించారు. ముసురు వర్షాల నేపథ్యంలో భూమిలో తేమ అధికంగా ఉండటం వల్ల విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలన్నారు. ముఖ్యంగా ఐరన్ పోల్స్‌ను ముట్టుకోరాదన్నారు. విద్యుత్ అంతరాయం ఏర్పడితే స్థానిక విద్యుత్ అధికారులకు సమాచారం అందించాలని పేర్కొన్నారు.

### హైదరాబాద్‌కు తరలిన బీఆర్‌ఎస్ శ్రేణులు



**ధరూరు:** హైదరాబద్‌లోని తెలంగాణ భవన్‌లో జరిగిన బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య నాయకుల విస్తృత స్థాయి సమావేశానికి మండలం బీఆర్‌ఎస్ శ్రేణులు తరలివెళ్లాయి. సోమవారం మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని మాల్‌దొడ్డి, ద్యాగదొడ్డి తదితర గ్రామాల నుంచి నియోజకవర్గ నాయకుడు బాసు హనుమంతు నాయుడు నేతృత్వంలో పెద్ద ఎత్తున తరలివెళ్లారు. కార్యక్రమంలో గాజులపాడు రఘువర్ధన్ రెడ్డి, అబ్రహం, వీరేష్ పాల్గొన్నారు.

### కారును ఢీకొన్న బైక్.. ఇద్దరికి గాయాలు

**ఉండవెల్లి:** జాతీయ రహదారిపై ఉండవెల్లి శివారులోని స్టేజీ వద్ద కర్నూలు వైపు వెళ్తున్న ఆగి ఉన్న కారును వెనుక నుంచి బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులు గాయపడిన ఘటన సోమవారం జరిగింది. ప్రమాదంలో బైక్‌పై ఉన్న తండ్రి, కుమారుడు జమ్మన్న, బుచ్చన్నలు గాయపడగా వారిని 108లో కర్నూల్ ఆసుపత్రికి తరలించారు.

# ఉన్నత విద్య కలేనా?

- మండలంలో ఏర్పాటుకు నోచుకోని జూనియర్ కాలేజీ
- కళాశాల విద్యకు దూరమవుతున్న బాలికలు
- మూడేళ్లుగా కళాశాల కోసం మండల వాసుల పోరాటం



మంత్రి జూపల్లికి వినతిపత్రం అందజేస్తున్న కళాశాల సాధన సమితి సభ్యులు(ఫైల్)

**రాజోళి:** ఉన్నత విద్య గ్రామీణ విద్యార్థులకు అందని ద్రాక్షగా మారింది. ఏపీ– తెలంగాణ సరిహద్దు మండలంగా ఉన్న రాజోళిలో విద్యార్థులకు ఇంటర్ ఆపై తరగతులకు చదివేందుకు ప్రభుత్వ కళాశాలలు లేకపోవడం, ఇతర ప్రాంతాలకు వెళ్లాలన్నా రవాణా కష్టాలు వేధిస్తుండటంతో వందల మంది విద్యార్థులు ఉన్నత చదువుకు దూరమవుతున్నారు. మండల కేంద్రంగా ఆవిర్భవించి ఏళ్లు గడుస్తున్నా, జూనియర్ కాలేజీ విషయాన్ని పట్టించుకునే నాథుడే లేరని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది కూడా కనీసం జూనియర్ కళాశాల వస్తుందని ఎదురు చూసిన విద్యార్థులకు నిరాశే మిగిలింది.

**పదో తరగతితోనే ముగింపు**

మండల పరిధిలో ప్రతి ఏడాది వందల సంఖ్యలో విద్యార్థులు పదో తరగతి ఉత్తీర్ణత సాధిస్తున్నా ఇంటర్ విద్య చదివించేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు ఆసక్తి కనబర్చడం లేదు. మండలంలో 14 గ్రామాలు ఉండగా, రాజోళి నుంచే ప్రతి ఏడాది 150 నుంచి 200 మంది విద్యార్థులు పదో తరగతి పాసవుతున్నారు. సగటున మండలం నుంచి దాదాపు 400 మంది విద్యార్థుల వరకు పదో తరగతి పూర్తి చేస్తున్నారు. కానీ మండలంలో పై చదువులు చదివేందుకు కాలేజీలు లేకపోవడంతో ఉన్నత విద్యకు దూరమవుతున్నారు.

**వేధిస్తున్న సమస్యలు**

ఉన్నత చదువులకు రాజోళి సరిహద్దులోని గద్వాలకు వెళ్లాలంటే 60 కి.మీ దూరం ప్రయాణించాల్సి వస్తుంది.శాంతిగనర్, అయిజ, మానవపాడు వెళ్లేందుకు గ్రామాల నుంచి సరైన రవాణా సౌకర్యం లేక ఉన్నత చదువులకు దూరమవుతున్నారు. ముఖ్యంగా ఆడపిల్లలు పదో తరగతి పూర్తైన అనంతరం పనులకు వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు. రూ.లక్షలు ఖర్చుపెట్టి కార్పొరేట్ కాలేజీలు, హాస్టళ్లలో చేరించలేమని, మండల కేంద్రంలో కాలేజీ ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

**నిరసనలు.. వినతిపత్రాలు**

మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు కోసం కాలేజీ సాధన సమితి ఆధ్వర్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులు అధికారుల చుట్టు ప్రదక్షిణలు చేసినా కళాశాల ఏర్పాటు చేయలేదంటున్నారు. మూడేళ్లుగా ర్యాలీలు చేసినా, నాయకులను కలిసినా పట్టించుకోవడం లేదని సాధన సమితి సభ్యులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.



కళాశాల సాధన కోసం ర్యాలీ చేస్తున్న గ్రామస్తులు(ఫైల్)

**కళాశాల ఏర్పాటు చేయాలి**



ఇంటర్ విద్యనభ్యసించేందుకు ఇతర ప్రాంతాలకు అమ్మాయిలను పంపడం లేదు. మూడేళ్లుగా జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తారని ఎదురుచూస్తున్నాం. ఈ ఏడాది పదో తరగతి పాసయ్యాను. ప్రస్తుతం మా బ్యాచ్‌లో చాలా మంది చదువుకు దూరమయ్యే అవకాశముంది.

–లక్ష్మి, విద్యార్థి, రాజోళి

**పనికి వెళ్తున్నారు**



రాజోళిలో జూనియర్ కళాశాల లేక చాలా మంది అమ్మాయిలు పై చదువులకు వేరే మండలాలకు వెళ్లలేక చదువు మానేయాల్సిన పరిస్థితి ఉంది. దీంతో కొందరు పనులకు వెళ్తున్నారు. కళాశాల ఆవశ్యకతపై గతంలో అధికారులకు,నాయకులకు వినతి పత్రాలు అందజేశాం.

– అఫ్రీన్, విద్యార్థి, రాజోళి

**మూడేళ్లుగా వినతులు**



జూనియర్ కళాశాల సాధన కోసం కాలేజీ సాధన సమితి తరఫున మూడేళ్లుగా అధికారులకు వినతిపత్రాలు అందజేస్తూనే ఉన్నాం. ర్యాలీలు, నిరసనలు, నిరాహార దీక్షలు చేశాం. మంత్రులకు కళాశాల ఆవశ్యకతను వివరించాం. అయినా కళాశాల మంజూరు కాలేదు.

– ఈశ్వరయ్య, కళాశాల సాధన సమితి కన్వీనర్

# ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు



కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలంలో ఆక్రమణలు తొలగిస్తున్న సిబ్బంది

**అయిజ:** ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ సైదులు అన్నారు. మున్సిపాలిటీలోని రాయచూర్ రోడ్డు సమీపంలో ప్రభుత్వ స్థలంలో సిమెంట్ వస్తువుల వ్యాపారం చేస్తున్న స్థలాన్ని సోమవారం ఖాళీ చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. రాయచూరు రోడ్డు సమీపంలో శిల్పా బార్ అండ్ రెస్టారెంట్ పక్కన ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకొని ఓ వ్యక్తి సిమెంట్ వస్తువులు వ్యాపారం చేస్తున్నాడని, డ్రైనేజీ, కల్వర్టు పూడ్చివేశాడని కొందరు కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రభుత్వ స్థలంలో ఉన్న కట్టడాలు తొలగించి ఖాళీ చేయించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బడిబయట పిల్లలను పాఠశాలలో చేర్పించాలి



సమావేశంలో ఎంఈఓ సురేష్

**మల్దకల్:** బడి బయట ఉన్న పిల్లలందరినీ పాఠశాలలో చేర్పించి వారి విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఇన్‌చార్జ్‌ఎంఈఓ సురేష్, సీడీపీఓ హేమలత అంగన్‌వాడీ టీచర్లు, తల్లిదండ్రులకు సూచించారు. సోమవారం మల్దకల్ ఉన్నత పాఠశాలలో బడిబాట కార్యక్రమంపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదేళ్లు నిండిన చిన్నారులను స్థానిక ప్రాథమిక పాఠశాలలో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగరాణి, ఉపాధ్యాయులు జాకీర్ హుస్సేన్, బజారన్న, మునెప్ప, లక్ష్మీ, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# రైతులు సద్వినియోగం చేసుకోవాలి

**అయిజ:** ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న వేరుశనగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రైతు ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్ సుధాకర్‌గౌడ్, సీఈఓ వినీత్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఉచితంగా పంపిణీ చేసే వేరుశనగ విత్తనాలు కావాల్సిన రైతులు మండల కేంద్రంలోని రైతు ఉత్పత్తి దారుల సంఘం కార్యాలయంలో రూ.1,100 చెల్లించి సభ్యత్వం తీసుకోవాలని సూచించారు. ఆయిల్ శాతం ఎక్కువగా ఉండే గిరినార్ వేరుశనుగ రకం విత్తనాలను వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఒక రైతుకు గరిష్ఠంగా నాలుగు ఎకరాల వరకు ఐదు సంవత్సరాలపాటు ఇవ్వనున్నట్లు తెలిపారు. అయిజ, గట్టు, ఇటిక్యాల మండలాల రైతులకు ఉచితంగా వేరుశనగ విత్తనాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. అయిజ మండలానికి 1,250 ఎకరాల వరకు వేరుశనగ విత్తనాలు మంజూరైనట్లు పేర్కొన్నారు. సభ్యత్వం తీసుకునే వారు ఆధార్‌కార్డు, పాస్‌బుక్ జిరాక్స్, భూసార పరీక్ష ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలని పేర్కొన్నారు.

# వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న వైద్యురాలు స్వరూపరాణి

**మల్దకల్:** వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది అప్రమత్తంగా డాక్టర్ స్వరూపరాణి సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం వైద్య సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రోటాసీల్ వ్యాక్సినేషన్‌పై వివరించారు. 30 ఏళ్లు పైబడిన వారందరికీ బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి వారి ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించడంతో పాటు రిజిస్ట్రర్లలో పేర్లు నమోదు చేయాలన్నారు. వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్రీధర్, వెంకటస్వామి, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

# తహసీల్దార్‌పై చర్య తీసుకోవాలి

**గద్వాల:** అక్రమాలకు పాల్పడిన వారిపై, హైకోర్టు ఉత్తర్వులు అమలు చేయకుండా అన్యాయం చేస్తున్న గద్వాల తహసీల్దార్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రైతు టి.పరమేశ్వరి కలెక్టర్ బీఎం సంతోష్‌ను కోరారు. సోమవారం ఫిర్యాదుల దినోత్సవంలో కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. వివరాలు.. గద్వాల మండలం పరమాల గ్రామ శివారులో సర్వే నంబర్ 134,135, 136, 137లో 12.13 ఎకరాల వ్యవసాయ పొలాన్ని 23 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్నట్లు తెలిపారు. కొందరు వ్యక్తులు ఫేక్ డాక్యుమెంట్లు, పాసుబుక్కులు సృష్టించి రైతుబంధు, రైతుభరోసా, రుణమాఫీ పొందుతున్నట్లు తెలిపారు. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగకపోవడంతో హైకోర్టును ఆశ్రయించగా హైకోర్టు వాస్తవ గ్రౌండ్ రిపోర్టు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఆరునెలలు గడచినా గద్వాల తహసీల్దా ర్ రిపోర్టు పంపకుండా ఇబ్బందులకు గురిచేస్తు న్నట్లు పేర్కొన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు రిపో ర్టు సమర్పించేలా, ఇబ్బందులకు గురి చేస్తున్న గద్వాల తహసీల్దార్‌పై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని ఫిర్యాదులో కోరినట్లు పరమేశ్వరి పేర్కొన్నారు.

# జూరాల ఆనకట్టపై వెలగని విద్యుత్ దీపాలు

**అమరచింత:** ఉమ్మడి జిల్లాకు వరప్రదాయినిగా ఉన్న ప్రియదర్శిని జూరాల ఆనకట్టపై ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు రాత్రి వేళ వెలగకపోవడంతో డ్యాం పరిసరాలతో పాటు రహదారి అంధకారంలో ఉన్నా పట్టించుకోనే అధికారులు కరువయ్యారు. జూరాల నీటితో జెన్‌కో అధికారులు విద్యుత్‌ను ఇక్కడి నుంచే తయారు చేస్తున్నా ప్రాజెక్టు పై మాత్రం విద్యుత్ వెలుగులకు నోచుకోలేకపోతుంది. జూరాల ప్రాజెక్టు ఎడమ కాల్వ సమీపంలో చేపల విక్రయాలతో పాటు వంటకాలు లభిస్తుండటంతో సుదూర ప్రాంతాల నుంచి పర్యాటకులు జూరాల ప్రాజెక్టు చేరుకుంటున్నా.. సాయంత్రం అవ్వగానే అక్కడి నుంచి వెళ్లిపోవాల్సిన దుస్థితి ఉంది. విద్యుత్ బల్బుల కోసం ఏర్పాటు చేసిన స్తంభాలు అలంకారప్రాయంగా మారాయి. ఇప్పటికైనా ప్రాజెక్టు అధికారులు స్పందించి రాత్రి వేళల్లో విద్యుత్ దీపాలు వెలిగేలా చూడాలని వాహనదారులు, పర్యాటకులు కోరుతున్నారు.

# స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి



సమావేశంలో స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు, కిషోర బాలికలు

**గట్టు:** స్వయం ఉపాధి ద్వారా మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని రాజ్‌కుమార్ ఫౌండేషన్ నిర్వహకురాలు రత్నకుమారి అన్నారు. సోమవారం బోయలగూడెం గ్రామంలో మహిళలకు స్వయం ఉపాధితో పాటుగా బాల్య వివాహాల నిర్మూలనపై ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకురాలు రత్నకుమారి మాట్లాడుతూ.. మహిళలు, కిషోర బాలికలు స్వయం ఉపాధి సాధించాలన్నారు. చేతి వృత్తులైన టైలరింగ్, ఎంబ్రాయిడరీ పనులు నేర్చుకోవడం ద్వారా కుటుంబానికి ఆర్థికంగా ఉండవచ్చన్నారు. బాల్య వివాహాలను ఎట్టి పరిస్థితుల్లో ప్రోత్సహించకూడదన్నారు. కార్యక్రమంలో మహిళలు, కిషోర బాలికలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ నమూనా ఇళ్లు పరిశీలన

**మానవపాడు:** మండల కేంద్రంలో ఇందిరమ్మ నమూనా ఇంటి నిర్మాణ పనులను సోమవారం ఎంపీడీఓ భాస్కర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ లబ్ధిదారులు నిర్మించుకునే ఇంటి మోడల్ నిర్మాణం కోసం చేపడుతున్న ఇందిరమ్మ నమూనా ఇళ్లు పూర్తి కానున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నిర్మాణ సిబ్బందికి తగు సలహాలు, సూచనలు ఇచ్చారు.

# గర్భిణులకు వైద్య పరీక్షలు



**మానవపాడు:** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రలో పెద్దపోతులపాడు, చిన్నపోతులపాడు, చెన్నిపాడు, గోకులపాడు గ్రామాలకు చెందిన 22 మంది గర్భిణులకు డాక్టర్ యాకుబ్ బాషా ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది రక్తహీనత, పోషకాహారం గురించి గర్భిణులకు అవగాహన కల్పించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సాధారణ కాన్పులు జరిగేలా ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది చంద్రన్న, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

# అందుబాటులో జీలుగ విత్తనాలు



గట్టులో విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు

**కేటీదొడ్డి:** జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి సాజీద్ రెహమ్మన్, ఏఈఓ ప్రీతిసుధ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రానికి 75 క్వింటాళ్ల కేటాయింగా 40 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయన్నారు. 50 శాతం సబ్సిడీతో రైతులకు అందజేయనున్నట్లు కావాల్సిన రైతులు పాలం పాసుపుస్తకం, ఆధార్ కార్డుతో వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

**రాయితీ విత్తనాల పంపిణీ**

**గట్టు:** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో రైతులకు రాయితీపై జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు. పీఏసీఎస్ చైర్మన్ వెంకటేష్, వ్యవసాయ అధికారి హనుమంతురెడ్డి విత్తనాలు అందజేశారు. పంటలకు పచ్చిరొట్ట ఎరువుగా జీలుగ విత్తనాలు పనిచేస్తున్నట్లు వ్యవసాయ అధికారి హనుమంతురెడ్డి తెలిపారు. రైతులు సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో ఏఈఓ తిరుమలేష్, రైతులు, సహకార సంఘం సిబ్బంది పాల్గొన్నారు.

**సబ్సిడీపై జీలుగ విత్తనాలు**

**రాజోళి:** రైతులకు సబ్సిడీపై జీలుగ విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు ఇన్‌చార్జ్ వ్యవసాయ అధికారి జె.రాధ ఒక ప్రకటనలో తెలిపారు. 50 శాతం సబ్సిడీతో విత్తనాలు పంపిణీ చేసేందుకు 200 బస్తాలు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. రైతులు పాసుబుక్, ఆధార్‌కార్డు జిరాక్స్‌తో వ్యవసాయశాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

# అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు



సోషల్ మీడియాలో వైరల్ అయిన ఫోటో

**ఎర్రవల్లి:** పాఠశాలల్లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని మండల విద్యాధికారి అమీర్‌పాష అన్నారు. మండల పరిధిలోని వేముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మద్యం సీసాలు, సిగరెట్ పీకలు దర్శనమిస్తున్నాయని శనివారం షోషల్ మీడియాలో ఓ పోస్ట్ వైరల్ కాగా.. సోమవారం ఎంఈఓ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యా కమిటీ సభ్యులతో కలిసి పాఠశాల ఆవరణ, తరగతి గదులు పరిశీలించారు. పాఠశాల మొదటి అంతస్తులోని సమావేశపు గది తాళాన్ని గుర్తు తెలియని దుండగులు పగలగొట్టి మద్యం, సిగరెట్లు తాగినట్లు తెలిపారు. పాఠశాలకు పూర్తిస్థాయిలో కాంపౌండ్ గోడ లేకపోవడంతో ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు పేర్కొన్నారు. సంఘటనపై కోదండాపురం పీఎస్‌లో పాఠశాల హెచ్‌ఎం హన్మంతు ఫిర్యాదు చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. గ్రామస్తులతో పూర్తిస్థాయి విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిక అందజేయనున్నట్లు ఎంఈఓ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే విజయుడు

**శాంతినగర్:** గద్వాల డీఆర్‌డీఏ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న షేక్ అస్లాం షరీఫ్ మాతృమూర్తి మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే విజేయుడు సోమవారం ఆమె మృతదేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు గద్దం శ్రీను, భార్గవ్, వడ్డేపల్లి సూరి, సాయి తదిదరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్‌పై పట్టింపేది



మార్లబీడులో చెత్తా చెదారాన్ని శుభ్రం చేస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు(ఫైల్)

- గ్రామాల్లో యథేచ్ఛగా ప్లాస్టిక్ కవర్ల వినియోగం
- అవగాహన కల్పించని అధికారులు
- పర్యావరణానికి తప్పని ముప్పు

**ధరూరు:** ప్లాస్టిక్ రక్కసిని తరిమేద్దాం.. ప్లాస్టిక్ భూతాన్ని అంతం చేద్దాం అంటూ మూడేళ్ల క్రితం ఓ ఉద్యమాన్నే చేసిన పాలకులు, అధికారులు ప్లాస్టిక్ నిషేధం అంశాన్ని గాలికొదిలేశారు. మండల కేంద్రంలో ప్రతి మంగళవారం నిర్వహించే వారాంతపు సంతతో పాటు నిత్యావసర సరుకులు, కూరగాయలు వంటి వాటికి సైతం ప్లాస్టిక్ కవర్లరు విచ్చలవిడిగా వాడుతున్నారు. అదే విధంగా గ్రామాల్లో విచ్చలవిడిగా ప్లాస్టిక్ వాడకంపై పర్యావరణ ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**నాడు చెప్పారు... నేడు మరిచారు**

మూడేళ్ల క్రితం కలెక్టర్‌తో పాటు అన్ని శాఖల అధికారులు మండల కేంద్రంలో ప్లాస్టిక్‌పై అవగాహన కల్పించారు. కొద్ది రోజుల పాటు ప్లాస్టిక్‌పై నిషేధం కొనసాగింది. అనంతరం అధికారుల పర్యవేక్షణ కరువవడంతో విచ్చలవిడిగా ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్నారు. సింగిల్ ప్లాస్టిక్ వినియోగాన్ని కట్టడి చేయాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంపై ప్రజలు, పర్యావరణ ప్రేమికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

**పొంచి ఉన్న ముప్పు**

ప్లాస్టిక్ వాడకం రోజురోజుకు పెరుతున్న తరుణంలో అదేస్థాయిలో పర్యావరణానికి ప్రమాదం పొంచి ఉంది. భూగర్భ జలాలు కలుషితమవడంతో పాటు కవర్లను తిన్న మూగజీవాలు బలవుతున్నాయి. 51 మైక్రాన్ల కన్నా తక్కువ ఉన్న ప్లాస్టిక్‌ను వినియోగించాలని నిబంధన ఉన్నా.. ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదు. మండల కేంద్రంలో ముఖ్యంగా వ్యాపార సముదాయాల వారు ఇష్టమొచ్చినట్లు నిషేధిత కవర్లను వినియోగిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. నార లేదా పేపర్ బ్యాగుల వినియోగంపై ప్రజలు అవగాహన కల్పించాలని పలు సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.



ప్లాస్టిక్ కవర్లలో కూరగాయలు తీసుకెళ్తున్న దృశ్యం

**చర్యలు చేపడతాం..**



సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై ప్రభుత్వం కఠినంగా ఉంది. ప్లాస్టిక్ వాడకంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నా పట్టించుకోవడం లేదు.దుకాణాలు, హోటళ్లను తనిఖీ చేసి 51 మైక్రాన్ల కన్నా తక్కువ నాణ్యత కలిగిన కవర్లు ఉన్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. ప్రతి గ్రామంలో పంచాయతీ కార్యదర్శుల ద్వారా తనిఖీ చేయిస్తాం. కాగితపు, నార సంచులను ప్రజలు వినియోగించేలా అవగాహన చర్యలు చేపడుతాం.

– మంజుల, ఎంపీడీఓ, ధరూరు.